క్లుప్తంగా

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక



వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కు మార్‌రెడ్డి గురువారం పట్ట ణానికి విచ్చేయనున్నారు. బుధవారం ఈ మేరకు ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నేదురుమల్లి ఉదయం 9 గంటల నుంచి తన నివాసంలో అందుబాటులో ఉంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ మునికుమారి

కోట: బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని సీడీపీఓ మునికుమారి అన్నారు. బుధవారం కోటలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే అంగన్‌వాడీ సిబ్బందిని అధికారులు బాధ్యులను చేస్తారని తెలిపారు. సూపర్‌వైజర్లు కవిత, క్రిష్ణమ్మ పాల్గొన్నారు.

రిలే దీక్షలకు సన్నద్ధం



డిపో ఆవరణలో నేతల నిరసన

గూడూరురూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో సీఐటీయూ సహకారంతో ఎస్‌డబ్ల్యూఫ్ కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు బుధవారంతో ఏడో రోజుకు చేరాయి. నేతలు మాట్లాడుతూ డిపో మేనేజర్ మొండి వైఖరిని విడనాడి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతలు రమణయ్య, చంద్రయ్య, అడపాల ప్రసాద్, కార్మిక సంఘ నాయకులు కె.ఎస్. వాసులు, క్రిష్ణ, కిరణ్, రఘురామ్, రుక్మిణమ్మ, సుబ్రహ్మణ్యం, శీనయ్య, జీవీ రమణయ్య, గరవయ్య, రాజు, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

కోలాహలం.. పోలేరమ్మ జాతర



పోలేరమ్మ గ్రామోత్సవం

కోట: చిట్టేడులో పోలేరమ్మ జాతర కోలాహలంగా జరుగుతోంది. ఐదవ రోజు బుధవారం అమ్మ వారికి దిష్టి తీర్పులు, గ్రామ పొంగళ్లు నిర్వహించి పోలేరమ్మ మిట్ట వద్ద నిలుపుదల చేశారు. మేళతాళాలతో అమ్మవారిని ఊరేగిస్తూ భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

వృద్ధులకు దుప్పట్ల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామానికి చెందిన వృద్ధులకు బుధవారం తడ కండ్రిగ ప్రాంతానికి చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గీత జయంతిని పురస్కరించుకుని దుప్పట్లు వితరణగా అందజేశారు. కె.శ్రీనివాసులు, సురేష్, ఎం శ్రీనివాసులు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకులు నాగరాజు తెలిపారు. సభ్యులు సుందరయ్యస్వామి, సుబ్రమణ్యం, సునీల్ పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌తో ప్రయోజనం



కూరగాయలు పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు: కోల్డ్ స్టోరేజ్‌తో పరిసర ప్రాంత రైతులకు ప్రయోజనకరమని నాబార్డు జిల్లా మేనేజర్‌బాబు అన్నారు. బుధవారం తాళ్వాయిపాడు గ్రామంలో కొత్తగా నిర్మించిన కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూరగాయలు, పండ్లను గ్రేడింగ్ చేసి ప్రత్యేక ప్యాకింగ్ ద్వారా మార్కెట్ ధరలతో విక్రయిస్తామన్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు ఉంటుందన్నారు. ఉద్యాన పంటలపై వచ్చే రాయితీలను, మార్కెటింగ్ విషయాలను హెచ్‌ఓ శారద వివరించారు. బ్యాంకుల ద్వారా పొందే రుణాలు, చెల్లింపులపై పలు బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం కూరగాయలను పరిశీలించారు. మండల వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ, గణేష్, బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

కిందే కూలబడి

పాఠశాల భవన నిర్మాణాలు సగంలో ఉండగా ప్రభుత్వం మారడం విద్యార్థులకు శాపంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద మౌలిక వసతులు ఏర్పాటుతోపాటు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. ఈక్రమంలో ప్రభుత్వం మారడం భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచి పోవడంతో పాఠశాల వరండాలో, ఆరు బయట చెట్ల కింద, ల్యాబ్ గదుల్లో చదువులు కొనసాగుతున్నాయి. ఒకరి పాఠాలు మరొకరికి వినపడుతుండడంతో విద్యాబోధన గందరగోళంగా మారి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

– కోట



సైన్స్ ల్యాబ్‌లో నేలపై కూర్చున్న విద్యార్థులు

- తరగతి గదుల్లేక విద్యార్థులకు కష్టాలు
- ఆరు సెక్షన్లు ఆరు బయటే
- అర్ధంతరంగా నిలిచిపోయిన నాడు–నేడు పనులు
- దుస్థితిలో కోట ఏవీకేఆర్ జెడ్పీ హైస్కూల్

కోటలోని ఏవీకేఆర్ జెడ్పీ హైస్కూల్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. 1960లో పాఠశాలను ప్రారంభించారు. ఈప్రాంతంలో ఏర్పాటైన మొదటి పాఠశాలగా గుర్తింపు తెచ్చుకుంది. ఎందరో మేధావులను తయారు చేసిన పాఠశాల నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. 500 మంది విద్యార్థులున్న పాఠశాలలో మొత్తం 16 గదులు అవసరమవుతాయి. పది గదులే అందుబాటులో ఉండడంతో మిగతా తరగతుల నిర్వహణకు గదుల కొరత ఉంది. దీంతో కొన్ని సెక్షన్లను ఆరు బయట, వరండాలో, ల్యాబ్‌లో నిర్వహిస్తున్నారు. కొన్ని తరగతుల విద్యార్థులు బెంచీలపై కూర్చుంటుండగా కొన్ని తరగతులకు కింద కూర్చుంటున్నారు. 2023 నుంచి పాఠశాల స్థాయిని పెంచి హైస్కూల్ ప్లస్ కింద జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. 104 మంది ఉన్న కళాశాల రెండు తరగతులు ఇక్కడే నిర్వహిస్తున్నారు. దీంతో పాటు హెచ్‌ఎం, స్టాఫ్ రూం, సైన్స్ ల్యాబ్ కూడా ఉన్న గదుల్లోనే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

నాడు–నేడుతో అభివృద్ధి వైపు..

నాడు–నేడుతో పాఠశాలను సుందరంగా తయారు చేశారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించారు. గదుల కొరత తీర్చేందుకు ఆరు గదుల నిర్మాణానికి నాడు–నేడు రెండో విడతలో రూ.66 లక్షలు మంజూరయ్యాయి. ఈనిధులతో ప్రస్తుతం ఉన్న భవనాలపైన కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. రూ.40లక్షలతో శ్లాబ్ దశ వరకు పూర్తి చేశారు. పనులు జరుగుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో పనులు నిలిచిపోయాయి. మనబడి నాడు–నేడు స్థానంలో కూటమి ప్రభుత్వం మన బడి..మన భవిష్యత్తు అంటూ పేరు మార్చింది. కానీ నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించలేదు. వెంటనే పనులను పూర్తి చేసి తరగతి గదుల కొరత తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



కోట ఏవీకేఆర్ జెడ్పీ హైస్కూల్



నాడు-నేడులో శ్లాబ్ వరకు పూర్తయిన తరగతి గదులు



వరండాలో విద్యాబోధన

పనులు నిలిచిపోయాయి



గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాం. నాడు-నేడు రెండవ విడత కింద ఆరు గదుల నిర్మాణం చేపట్టాం నిలిచిపోయిన పనులు పూర్తిచేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నాం. ఇంకా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

-సురేంద్రబాబు, హెచ్‌ఎం

విద్యార్థుల కష్టాలు తీర్చాలి



తరగతి గదుల్లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఉన్న గదులనే సర్దుబాటు చేయాల్సి వస్తోంది. విద్యాబోధన సక్రమంగా సాగడం లేదు. ప్రభుత్వం వెంటనే మిగిలిన పనులను పూర్తి చేసి విద్యార్థుల కష్టాలు తీర్చాలి.

-వాసు, కోట

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



విద్యార్థులకు తరగతి గదుల కొరత ఉంది. ఈ సమస్యను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే భవన నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం. విద్యార్థుల కష్టాలు తీరుస్తాం.

ఎస్‌కే హాజీరా,
పేరెంట్స్ కమిటీ చైర్మన్

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



వైఎస్సార్‌సీపీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కిలివేటి సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

- 13న వైఎస్సార్‌సీపీ ర్యాలీకి తరలిరండి
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి వాటిని ఇప్పటివరకు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రంలో ఈనెల 13న అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ చేపట్టే ర్యాలీకి రైతులు, పార్టీ శ్రేణులు ప్రజలు భారీగా తరలిరండి అంటూ సంజీవయ్య పిలుపునిచ్చారు. ముందుగా అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పేరుతో ఉన్న పోస్టర్లను ఆవిష్కరించారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సంజీవయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా ఈనెల 13న ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు సన్నద్ధమవుతున్నట్లు వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా ప్రతి ఏడాది రైతు భరోసా పథకం ద్వారా నగదు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పి నేడు ఖరీఫ్, రబీ, వ్యవసాయ సీజన్‌లు ముగుస్తున్నా ఇవ్వకుండా నట్టేట ముంచిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వ ఆర్బీకేలను నిర్వీర్యం చేయడమే కాకుండా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా వెన్నుపోటు పొడిచిందన్నారు. ఆరు నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు తప్ప అభివృద్ధి మాటే లేదన్నారు. ఈక్రమంలో రైతుల సమస్యలపై పోరుబాటను సాగించేలా 13 తేదీ నెల్లూరు జిల్లా కేంద్రంలో రైతులతో కలసి భారీ ర్యాలీ, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సమాయత్తమైనట్లు వెల్లడించారు. ఎస్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ర్యాలీ కార్యక్రమానికి నియోజవర్గం నుంచి అధిక సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మి, గడ్డం అరుణమ్మ, జిల్లా కార్యదర్శి ఒట్టూరు కిషోర్‌యాదవ్, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కలికి మాధవరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, నేతలు పి.హరినాథ్‌రెడ్డి, చదలవాడ కుమార్, పాపాడి చంద్రారెడ్డి, దారారవి, కాలగంధ సునీల్, రాహుల్ పాల్గొన్నారు.

పంట బీమా తప్పనిసరి

వెంకటగిరిరూరల్ : రైతులు తామ సాగు చేస్తున్న పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని జంగాలపల్లె యాచముద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు వరి పంట ఎకరాకు రూ.630, వేరుశనగ ఎకరాకు రూ.450 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, పశువులను సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, ఏఈఓ రామ్మోహన్, వీపీఏ గోపీకృష్ణ, సుమతి, గోవిందు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



స్వీట్‌షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

వెంకటగిరి(సైదాపురం) : పట్టణంలోని పాత బస్టాండ్, పోలేరమ్మ ఆర్చి సెంటర్, కాశీపేట, క్రాస్ రోడ్డు సమీపంలోని పలు దుకాణాలను బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఫుడ్ కమిషన్ అధికారి నర్మద మాట్లాడుతూ తినుబండారాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. అలాగే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పదార్థాల్లో నాణ్యత పాటించని పలు దుకాణాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన వ్యక్తి

చిల్లకూరు: గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం రాత్రి మృతిచెందినట్లు చిల్లకూరు పోలీసులు బుధవారం తెలిపారు. తూర్పుకనుపూరు గ్రామంలో రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి స్పృహతప్పి పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారన్నారు. వారు అతన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో 50 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీలో ఉంచామన్నారు. గుర్తించిన వారు చిల్లకూరు పోలీస్‌స్టేషన్లోగానీ, 9440796347 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు..

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వాణిరెడ్డి

బాలాయపల్లి(సైదాపురం) : గ్రామీణ ప్రాంతాల్లో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌డీఓ వాణిరెడ్డి ఆదేశించారు. బుధవారం బాలాయపల్లెలోని స్త్రీశక్తి భవనంలో సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు మ్యాపింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ వినీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

వెంకటగిరిరూరల్: ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఓ యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. మన్నవరానికి చెందిన తేజ బైక్‌లో పాతబస్టాండ్ వైపు వెళుతున్నారు. అదేసమయంలో మరో ఆటో బంగారుపేట వైపు బయలుదేరింది. కుమ్మరిగుంట సాయిబాబా విగ్రహం వద్ద బైక్, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో తేజకు తీవ్రగాయాలు కాగా, ఆటో ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికులు తేజను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి, పరిస్థితి విషమంగా ఉండడంతో క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోండి



పెళ్లకూరు: అధికారులను నిలదీస్తున్న సత్యనారాయణరెడ్డి



కోటలో..



రాపూరు : మాట్లాడుతున్న తహసీల్దార్

ఓజిలి: మండలంలోని ఆచార్లపార్లపల్లి, రుద్రాయపాలెం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెండు గ్రామాల్లో 12 వినతులు అందాయని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఆర్‌ఐ విజయ్‌కుమార్,సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: కొత్తపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును అధికారులు నిర్వహించగా భూసమస్యలపై అధిక సంఖ్యలో అర్జీలు అందాయని తహసీల్దార్ శైలకుమారి అన్నారు. ప్రత్యేక అధికారి శ్రీధర్, సర్వేయర్ నాగరాజు, ఆర్‌ఐ ప్రవీణ్‌రాయల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరు: ప్రజాసమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులతో రెవెన్యూ గ్రామసభల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అధికారులను నిలదీశారు. చిల్లకూరులో జరిగిన రెవెన్యూ గ్రామసభకు ఆయన చేరుకొని గ్రామంలోని పెద్ద చెరువును కబ్జాదారుల నుంచి విడిపించాలని కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కూటమి నేతల అన్యాయాలకు అండగా నిలవడం మంచిది కాదన్నారు. స్పందించిన తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాల వల్ల ఆలస్యమైందని త్వరలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ సంతోషిణిబాయి, వీఆర్వోలు వంశీ, రమేష్, సర్పంచ్ హరిబాబురెడ్డి, నేతలు రాజారెడ్డి, రాకేష్‌రెడ్డి, వేణురెడ్డి, మునిచంద్ర పాల్గొన్నారు.

సైదాపురం : రెవెన్యూ పరిధిలోని సమస్యల పరిష్కారానికే ప్రత్యేకంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. బుధవారం మండలంలోని తురిమెర్లలో రెవెన్యూ సదస్సు చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు అర్జీలు సమర్పించాలని కోరారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ పెంచలయ్య పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

రాపూరు : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని జోరేపల్లెలో చేపట్టిన సదస్సులో మొత్తం 8 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: తిక్కవరం, చేడిమాల, తిప్పగుంటపాళెం గ్రామాలకు చెందిన రెవెన్యూ సదస్సును తిక్కవరం గ్రామంలో బుధవారం నిర్వహించారు. మూడు గ్రామాలకు చెందిన వారి వద్ద నుంచి 68 అర్జీలు వచ్చాయన్నారు. అంతకుముందు గ్రామంలో సదస్సులపై అవగాహన కల్పించేలా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కోటలో..

కోట: సాగరమాల రోడ్డుకు భూములిచ్చిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బాధితులు అధికారులను కోరారు. ఊనుగుంటపాళెంలో తహసీల్దార్ జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అధికారులను కలసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: మంగానెల్లూరు, అచ్చుకట్ల గ్రామాల్లో తహసీల్దార్ నరసింహరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి 43 అర్జీలను స్వీకరించారు.



చిల్లకూరులో..



సూళ్లూరుపేటలో..